క్లుప్తంగా

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అమరావతి: మండల పరిధిలోని నరుకుళ్ళ పాడు, అమరావతి, ధరణికోట సచివాలయాలను మంగళవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాలలో ప్రజలకు అందించే సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు రికార్డులను పరిశీలించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవలలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్థాయి టీడీపీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



బెల్లంకొండ: పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచికరంగా పెట్టాలని తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం, మండల విద్యా శాఖాధికారి బాలసుందరరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ కచ్చితంగా పాటించాలని, వారానికి ఐదు కోడిగుడ్లు తప్పనిసరిగా పెట్టాలన్నారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. వారి వెంట గ్రామ సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, పీయస్కె మస్తాన్‌షరీఫ్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

కుంకలగుంటలో ఫ్లాగ్ మార్చ్



నకరికల్లు: చిన్నపాటి ఆవేశాలకు లోనై అనర్థాలు కొని తెచ్చుకోవద్దని రూరల్ సీఐ ఎం.రాంబాబు సూచించారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో ప్రజలను ఉద్దేశించి సీఐ రాంబాబు మాట్లాడారు. అనవసరపు కొట్లాటలకు పోయి జైలు పాలు కావద్దని హెచ్చరించారు. ప్రధానంగా యువత చెడు అలవాట్లకు, రాజకీయ ప్రలోభాలకు బానిసలు కావద్దన్నారు. ఎవరి లాభం కోసమో అనాలోచితంగా గొడవలకు దిగితే జీవితాలు అంధకారమవుతాయని అన్నారు. తోటివారితో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. పార్టీల పేరుతో స్వచ్ఛమైన స్నేహాలు, బంధుత్వాలు దూరం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో నకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ల ఎస్‌ఐలు కె.నాగేందర్‌రావు, షేక్.అమీర్‌బాషా, హజరత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఈ పంటపై శిక్షణ

క్రోసూరు: క్రోసూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులకు ఈ పంటపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏడీఏ వి.హనుమంతరావు పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో మండలంలో సాగు చేస్తున్న పంట వివరాలు ఈ-పంట యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సక్రమంగా నమోదు చేయటం ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే ప్రయోజనాలు లభిస్తాయన్నారు. కావున వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ముందుగా ప్రకటించి ఈ పంట నమోదు చేయాలని, అదేవిధంగా రైతులు కూడా వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు సహకరించి పంట వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, ఏఈఈ ఇబ్రహీం, ఏఎస్‌వో పి.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మిద్దె కూలి వృద్ధురాలికి గాయాలు

కారెంపూడి: మట్టి మిద్దె కూలి వృద్ధురాలు గాయపడిన ఘటన మండల కేంద్రమైన కారెంపూడిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కురిసిన భారీ వర్షానికి మట్టి మిద్దె నాని కూలిపోయింది. మిద్దె పైకప్పులో దూలం ఒకటి ఇంట్లో ఉన్న పలిశెట్టి వెంకమ్మ కాలుపై పడడంతో కాలుకు తీవ్ర గాయమైంది. అదృష్టవశాత్తూ మిద్దె కూలుతున్న శబ్దానికి ఆమె మేల్కొనటంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

ఈ కష్టాలు తీరేనా..!?

- నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్‌తో ప్రజల అవస్థలు
- విస్తరణకు నోచుకోని రైల్వేస్టేషన్ రోడ్డు
- ఆక్రమణలకు గురైన రోడ్డు మార్జిన్‌లు
- రోడ్డు పైనే వాహనాల పార్కింగ్



పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో కిక్కిరిసిన ట్రాఫిక్

సత్తెనపల్లి: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతోంది. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్లు విస్తరణకు నోచుకోకపోవడం... ఇరువైపులా రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురి కావడం... రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడం... వంటి కారణాలతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహన చోదకులు సతమతమవుతున్నారు. పట్టణంలోని గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిని గతంలో కొంత వరకు విస్తరించారు. అయినప్పటికీ ప్రస్తుతం ఆక్రమణలు పెరగడం, వాహనాలను దుకాణాల ముందు నిలపడంతో ఎప్పటిలాగే ట్రాఫిక్ కష్టాలు కొనసాగుతున్నాయి. ఈ రోడ్‌లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీ వాహనాల రాకపోకలు సైతం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనాల రాకపోకలకు తగ్గట్టుగా రహదారి లేక పోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది.

పట్టణ అంతర్గత రోడ్లలోనూ ఇబ్బందులే

పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి రైల్వేస్టేషన్ రోడ్, గోళ్ళమూడి వారి వీధి, గడియార స్తంభం నుంచి గాంధీచౌక్ వీధి, గడియార స్తంభం నుంచి లక్కరాజు గార్లపాడు సెంటర్ వరకు, వడ్డవల్లి పాత బస్టాండ్, తాలూకా సెంటర్, ప్రధాన రహదారి నుంచి పాతబస్టాండ్ వరకు, ప్రధాన రహదారి నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా... ఇలా పట్టణంలోని అంతర్గత రహదారులలో సైతం ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయి. వాహనాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. దీనికి తోడు అటు పెదకూరపాడు, పిడుగురాళ్ల, నరసరావుపేట, గుంటూరు వెళ్లేందుకు... సత్తెనపల్లి పట్టణానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం అవసరాల కోసం వస్తుంటారు. దీంతో పట్టణంలోకి వచ్చే బైకులు, కార్లు వేల సంఖ్యలో పెరిగిపోయి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. నిత్యం వాహనాల రద్దీతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.

- పట్టణానికి చెందిన వాహనాలే కాకుండా బయట నుంచి వచ్చి పోయే వాహనాలు రోజుకు పది వేలకు పైగా ఉంటాయని అంచనా. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యమైంది. ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపార సంస్థలు ఉండడంతో పాదచారులు, వాహనాలతో కిక్కిరిసి ట్రాఫిక్ పద్మవ్యూహంలా మారుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారుల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ



అందుకూరు గ్రామంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ

క్రోసూరు: ఎస్సీ వర్గీకరణ సాధనకై గౌరవనీయులు మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం జరపటం ద్వారా ఎస్సీ వర్గీకరణ విజయం సాధించటం జరిగిందని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సోమవారం రాత్రి మాదిగ పల్లెల్లో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీల్లో భాగంగా మండలంలోని అందుకూరు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి పండుగ జరుపుకున్నారు. ర్యాలీ ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు సిద్దల శీను, ఎమ్మార్పీఎస్ క్రోసూరు మండలం కోశాధికారి దుగ్గి రవి అధ్యక్షతన జరిగింది. ర్యాలీలో ఎమ్మార్పీఎస్ క్రోసూరు మండల అధ్యక్షులు కొడవటి కృపారావు మాదిగ, రాష్ట్ర ముఖ్య అతిథులు రుద్రపోగు సురేష్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల జానుబాబు మాదిగ, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేమవరపు జీవన మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు నందిగం దేవదాసు మాదిగ, ఎంఎస్‌పీ నియోజకవర్గ నాయకులు మేదర లక్ష్మయ్య మాదిగ, ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు చిలక సురేష్ మాదిగ (మాస్టర్), చిలకా సుకుమార్ మాదిగ, జగన్నాథం అశోక్, మరియదాసు, రవి పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణలో ఆశాల పాత్ర కీలకం



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డాక్టర్ బాలఅంకమ్మబాయి

రాజుపాలెం: మాతాశిశు సంరక్షణలో ఆశా కార్యకర్తలు ప్రముఖ పాత్ర వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్ బాలఅంకమ్మబాయి తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు మాతాశిశు సంరక్షణపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి తీసుకురావాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు గ్రామాలలో ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి జ్వరాలను సర్వే చేయాలని, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, ఆప్తాల్మిక్ అధికారి సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆశా నోడల్ అధికారి ఉషారాణి, ఎంఎల్‌హెచ్‌పీలు ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

భూ యజమాని ప్రమేయం లేకుండా రుణాలు ఇవ్వాలి

జిల్లా కౌలు రైతు సంఘం సభ్యులు



ధర్నాచేస్తున్న జిల్లా కౌలు రైతు సంఘం సభ్యులు

రాజుపాలెం: భూ యజమానుల ప్రమేయం లేకుండా కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదురు జిల్లా కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులకు వెంటనే వ్యవసాయ రుణాలు ఇవ్వాలని మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ మాట్లాడుతూ గతంలో భూ యజమానులకు సంబంధం లేకుండా వ్యవసాయ రుణాలు ఇచ్చారని ఇప్పుడున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ భూ యజమాని కూడా సంతకం పెడితేనే రుణాలు ఇస్తామని పెండింగ్ పెడుతున్నారని మండిపడ్డారు. కౌలు రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి గతంలో రుణాలు ఇచ్చారని ఇప్పుడు ఇవ్వకపోవడంపై జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి మెట్టు పిచ్చిరెడ్డి, కౌలు రైతులు రామారావు, చిన్న వీరయ్య, మాగంటి బాల, నాగార్జున, పున్నయ్య, అమరేశ్వరరావు, రమేష్, గోపయ్య పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన



రైతు సేవాకేంద్రంలో మాట్లాడుతున్న ఏవో

రాజుపాలెం: సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను రైతులు తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని గణపవరంలోని రైతు సేవాకేంద్రంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏవో మాట్లాడుతూ రాజస్థాన్‌లో రైతుల పోరాటంతోనే చట్టం వచ్చిందని వివరించారు. రైతుల నుంచి వచ్చిన చట్టం కాబట్టి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు తాతా నాగరామారావు మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం ప్రభుత్వ పనితీరులో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించే విధంగా ఉంటుందని అన్నారు. ప్రతి కార్యాలయం బోర్డులో అధికారుల బాధ్యతలు విధులు ఉంచాలని తెలిపారు. సమాచార చట్టంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.సదాశివారెడ్డి

క్రోసూరు: క్రోసూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు సేవా కేంద్రంలో అధికారులకు, ప్రజలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమాచారహక్కు చట్టం–2005పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా జి.సదాశివారెడ్డి పాల్గొన్నారు. సదాశివరెడ్డి మాట్లాడుతూ అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావటం కోసం, సమాచారం ప్రజలకు తెలియటం కోసం, పౌరలకున్న సమాచార హక్కును చట్టబద్ధత చేయటం కోసం ఈ చట్టం ఉద్దేశించబడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఏ శాఖ నుంచి సమాచారం కావాలన్నా ఏవిధంగా దరఖాస్తు చేయాలి, ఎంత రుసుం చెల్లించాలి, ఎన్ని రోజుల లోపు సమాచారాన్ని పొందవచ్చు వంటి వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ హనుమంతరావు, ఏవో వి.విణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

బెల్లంకొండ: ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని రాయల్ దళిత యువత వ్యవస్థాపక అధ్యక్షులు మట్టపూడి విజయకుమార్ అన్నారు. మంగళవారం బెల్లంకొండలో మాట్లాడుతూ మాదిగల దశాబ్దాల కల వర్గీకరణ అని సుప్రీం తీర్పుతో అది నెరవేరబోతోందని పేర్కొన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన 59 కులాలకు ఎస్సీ రిజర్వేషన్ సమపాళ్లలో అందడంతో పాటు అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ తీర్పు ఎవరికి వ్యతిరేకం కాదని ఉద్యోగ, విద్యా రంగంలో సమన్యాయం జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్ ఫలాలు అందరికీ దక్కాలని మందకృష్ణ మాదిగ ఉద్యమాల ఫలితంతోనే ఈ తీర్పు వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల అణగారిన వర్గాలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ద్వారా సామాజిక న్యాయం జరిగిందన్నారు.

ప్రత్యామ్నాయ వరి విత్తనాలు సాగు చేయండి

ఏడీఏ వి.హనుమంతరావు

క్రోసూరు: మండలంలో వరి సాగు రైతులు అధికంగా కోరుతున్న జేజీఎల్ 384 రకం వరి విత్తనాల కొరత ఉందని, ప్రత్యామ్నాయ వరి విత్తనాలు సాగు చేయవచ్చునని ఏడీఏ హనుమంతరావు మంగళవారం తెలిపారు. మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన రైతులు జేజీఎల్ రకం తెప్పించాలని కోరిన మీదట ఆయన పత్రికా ప్రకటన ద్వారా ప్రత్యామ్నాయ వరి విత్తనాల గురించి తెలియపరిచారు. జేజీఎల్ 384 రకం కంటే 10 రోజులు ముందుగా అంటే 125 రోజులకు దిగుబడి వచ్చే రకాలను వివరించారు. ఎంటీయూ 1224, ఎంటీయూ 1282, ఎన్‌ఎల్ఆర్ 34449 రకాలు సాగు చేయవచ్చన్నారు. ఈ రకాలు అగ్గితెగులును తట్టుకుంటాయన్నారు. అదేవిధంగా ఈ రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ప్రత్యామ్నాయ రకాలను సాగు చేయాలని కోరారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



పెదకూరపాడు: లగడపాడు గ్రామంలో సంఘం డెయిరీ మిల్క్ కలెక్షన్ సెంటర్‌లో పాల ఉత్పత్తిదారులకు మంగళవారం బోనస్ పంపిణీ చేశారు. 34 మంది రైతులకు గాను రూ.1,06,275 పంపిణీ చేసినట్లు మిల్క్ కలెక్షన్ సెంటర్ అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సంగం డెయిరీ మేనేజర్ గోపి, సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత



విద్యార్థిని ఫీజు చెల్లించి రశీదు పొందుతున్న కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: పట్టణంలోని నారాయణ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని మహాలక్ష్మికి ప్రోత్సాహంగా మంగళవారం స్కూల్ ఫీజు రూ.25 వేలు ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతూ చదువులో ముందుంటున్న విద్యార్థులను దత్తత తీసుకొని వారి చదువుకు అయ్యే ఖర్చు మొత్తం దాతల సహకారంతో అందించడం జరుగుతుందన్నారు. నారాయణ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు ఇలాంటి తోడ్పాటు అందజేయడం వల్ల వారు జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉంటారన్నారు. విద్యాదానం చేసిన వారిని గుర్తుపెట్టుకుని బాగా చదివి సమాజంలో మంచి పేరు సాధించాలని, అందులోనూ కొత్త రామకృష్ణ సేవా కార్యక్రమంలో ఎప్పుడు ముందుంటారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

తల్లి పాలు అమృతంతో సమానం



చింతపల్లిలో జరిగిన తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



చాగంటివారిపాలెంలో...



మాచాయపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది

అచ్చంపేట: తల్లి పాలు బిడ్డకు కావలసిన పోషక విలువలు, వ్యాధినిరోధక శక్తిని ఇస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యమ్మ తెలిపారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని చింతపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. తల్లి పాలు అమృతంతో సమానమన్నారు. మొదటి మూడు రోజులు తల్లి బిడ్డకు తప్పనిసరిగా పాలు పట్టాలన్నారు. ముర్రు పాలలో మూడు సంవత్సరాలకు కావలసిన వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని చెప్పారు. తల్లులు, గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రోజారాణి, వైద్య సిబ్బంది అంజయ్య, లిల్లీ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.రత్నకుమారి, షేక్ ఖాజాబి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలి

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల) : బిడ్డ పుట్టిన అరగంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అనంతలక్ష్మి అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు, ర్యాలీ సత్తెనపల్లి ప్రాజెక్టు ముప్పాళ్ళ సెక్టార్‌లోని చాగంటివారిపాలెం, దమ్మాలపాడు గ్రామాల్లో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు ఇవ్వాలని ఈ పాలు బిడ్డకు మొదటి టీకా లాంటిదని తెలియజేశారు. 6 నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు షేక్ నూర్జహాన్, కే వెంకటరత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం పద్మావతి, ఎం మల్లేశ్వరి, డి.శ్రీలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బెల్లంకొండ: తల్లిపాలు బిడ్డకు సంజీవని వంటివి అని మాచాయపాలెం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ తెలిపారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని మాచాయపాలెంలో తల్లి పాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. తల్లి పాల ద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. పిల్లలకు డబ్బా పాలు తాగించడం ద్వారా ఆ శక్తిని వారు కోల్పోతారని చెప్పారు. పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మణికుమారి మాట్లాడుతూ ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డలకు తల్లిపాలనే తాగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఆయాలు పాల్గొన్నారు.

మాదలలో పశు వైద్య శిబిరం



రైతులకు పశు పౌష్టికాహారం అందిస్తున్న జిల్లా పశువైద్యాధికారి కాంతారావు

ముప్పాళ్ల: మండలంలోని మాదల గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధులపై పశు వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. జిల్లా పశువర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ బాల శంకరరావులు శిబిరాన్ని ప్రారంభించారు. వారు ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధులను నివారించి పునరుత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా పాడిని లాభదాయకంగా చేసుకోవచ్చని తెలిపారు. సకాలంలో యద లక్షణాలను గుర్తించడం ద్వారా తిరగ గట్టే సమస్యను నివారించవచ్చని తెలిపారు. 12 పశువులకు గర్భకోశ సంబంధిత, 8 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ సీహెచ్ నరసింహులు, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ జి.శ్రీనివాసకావు, డాక్టర్ వి.కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎం.పుల్లారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బాలికలు ధైర్యసాహసాలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం

బెల్లంకొండ: బాలికలు చిన్నతనం నుంచే ధైర్య సాహసాలను కలిగి ఉండాలని తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాటి ప్రభ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సేవ్ గర్ల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆడపిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిని చేరుకోవాలంటే చదువు అనేది ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే బాధ్యతగా ఉండాలని, మాట్లాడే విధానం జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఎంఈవో బాలసుందరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ, సెల్‌ఫోన్‌కు పిల్లలు దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో కోటమ్మ మాట్లాడుతూ సమాజంలో బాలికలు, మహిళలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఉంగరాల కార్తీక్, ఏవో కృష్ణయ్య, పీహెచ్‌సీ వైద్యులు అంసుధర్, ఆర్ఐ పవన్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్, గ్రామ సర్పంచ్ గడ్డిపర్తి జ్యోతి సముద్రం, జనసేన స్టేట్ కోఆర్డినేటర్ మునగా వెంకట్, వీఆర్వో వెంకయ్య, మహిళా పోలీసులు మౌనిక, శాంతి, మహబూబి, రిహన, ఫాతీమున్నిసా పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టం అర్జీలపై సకాలంలో స్పందించాలి

నకరికల్లు: సమాచారం కోరుతూ కార్యాలయంలో అందజేసే సమాచారహక్కు చట్టం అర్జీలపై నిర్ణీత సమయంలోగా తగిన వివరాలు ఇవ్వాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు ముజావర్ జాన్‌అహ్మద్ కోరారు. బదిలీపై నూతనంగా వచ్చిన తహసీల్దార్ కె.పుల్లారావును ఐక్యవేదిక తరపున మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలన్నా, ప్రభుత్వ సేవలు సకాలంలో అందాలన్నా సమాచారహక్కు చట్టం తోడ్పడుతుందని అన్నారు. ప్రజల కోసం ఐక్యవేదిక తరపున సమాచార కార్యకర్తల శ్రమను గుర్తించి సహకరించాలని కోరారు. తహసీల్దార్ కె.పుల్లారావు మాట్లాడుతూ స్వచ్ఛందంగా సేవా దృక్పథంతో పనిచేస్తున్న కార్యకర్తలకు పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ఉపాధ్యక్షులు బద్దుల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటగిరి, కార్యదర్శి రెక్కల నర్సింహారెడ్డి, కోశాధికారి బెల్లంకొండ విశ్వేశ్వరరావు, సభ్యులు ఎస్.వెంకట్రావు, మడకా వెంకటేశ్వర్లు, రావూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దహనంపై కేసు నమోదు

క్రోసూరు: ద్విచక్రవాహనం దహనంపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. క్రోసూరు పంచాయతీ అనుబంధ గ్రామమైన ఎర్రబాలెంలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గుమ్మడి ఏసుబాబుకు చెందిన ద్విచక్రవాహనం గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసారన్న విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.